క్లుప్తంగా

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్

కల్లూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బి.మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు ఇందిరమ్మ కాలనీ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఏఏబీ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నరన్నారు. విద్యార్థులకు మంచి చదువులు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివరాం, గోపాల్‌రెడ్డి, నాగరాజు, నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఎస్ఈ ఉమాపతికి సత్కారం



ఎస్ఈ ఉమాపతిని సన్మానిస్తున్న సీఎండీ సంతోషరావు, ఈఆర్‌సీ సభ్యులు, అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతికి ఘన సన్మానం లభించింది. కర్నూలులో ఏపీ ఈఆర్‌సీ కార్యాలయ భవన నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డితో పాటు లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి. లక్ష్మణరెడ్డి, ఈఆర్‌సీ సభ్యులు హాజరయ్యారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు కార్యక్రమం విజయవంతం కావడంతో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు, ఈఆర్‌సీ సభ్యులు ఎస్ఈని శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డైరెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

మునిసిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్ఆర్ టీయూసీ అధ్యక్షుడు వైవీ రమణ

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కర్నూలు నగర మున్సిపల్ కార్పొరేషన్ వైఎస్ఆర్ టీయూసీ అధ్యక్షుడు వై.వి.రమణ కోరారు. శుక్రవారం నగరంలోని వడ్డగేరిలో ఉన్న స్కంద కాంప్లెక్స్ నుంచి యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్, మౌర్య ఇన్, ఐదు రోడ్ల సర్కిల్, వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా నగరపాలక సంస్థకు ఈ ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఆప్కాస్ కింద పనిచేస్తున్న హెల్త్, ఇంజినీరింగ్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.

21 ద్విచక్ర వాహనాలు సీజ్



మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ

కర్నూలు నగరంలో మైనర్ డ్రైవింగ్‌పై శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో రాజ్‌విహార్, సి.క్యాంప్, ఓల్డ్ ఈద్గా, చెన్నమ్మ సర్కిల్ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 21 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని రూ.42,735 జరిమానా విధించారు. ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపటం, రోడ్డు భద్రత నిబంధనలకు విరుద్ధమని వారికి హెచ్చరించారు. తర్వాత కొత్తపేటలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులను పిలిపించి డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు.

సచివాలయాల్లో ఈ శ్రామ్ కార్డులు

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులు సమీపంలోని సచివాలయాల్లో ఈ శ్రామ్ కార్డులకు దరఖాస్తు చేసుకుని పొందాలని కార్మిక శాఖ సహాయాధికారి కేశన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్డు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఈ కార్డును ప్రామాణికంగా తీసుకుంటారని పేర్కొన్నారు.

శ్రమజీవుల జీవితాల్లో వెలుగు!

- పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి సర్కారు ప్రాధాన్యం
- రూ. 12, 500 నుంచి రూ.18,500కు జీతం పెంపు
- మధ్య దళారీ వ్యవస్థ రద్దు
- ప్రతినెల 1 వ తేదీన వేతనాలు
- కర్నూలు కార్పొరేషన్‌లో 670 కుటుంబాలకు లబ్ధి



నగరంలోని ఓ ప్రధాన రోడ్డుపై చీపురు పట్టి ఊడుస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు



ఇంటింటి చెత్త సేకరణలో..

కర్నూలు (టౌన్) : తెల్లారకముందే చీపురు పట్టి నగరాన్ని శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికుల జీవితాల్లో జగన్ సర్కారు వెలుగులు తీసుకొచ్చింది. వేతనాలను పెంచడంతో పాటు వారిని ఆప్కాస్ (ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ సర్వీసెస్)లో కలిపింది. దీంతో వారికి ఉద్యోగ భద్రతతో పాటు ప్రతి నెలా 1 వ తేదీన వేతనాలు అందుతున్నాయి. టీడీపీ హయాంలో ఈ కార్మికుల పరిస్థితి అధ్వానంగా ఉండేది. ఎంత పని చేసినా అరకొర జీతమే..అది కూడా సక్రమంగా అందేది కాదు. దీనికితోడు ఉద్యోగ భద్రత కరువు. ప్రతి రోజూ బిక్కుబిక్కుమంటూ పని చేస్తూ.. కుటుంబపోషణకు అష్టకష్టాలు పడేవారు.

దళారీ వ్యవస్థకు చెక్

జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత దళారీ వ్యవస్థకు, మధ్యవర్తులకు చెక్‌పెట్టారు. మరీ ముఖ్యంగా మునిసిపాల్టీల్లో ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ సర్వీసెస్ వ్యవస్థను తీసుకొచ్చారు. దీంతో కార్మికులకు ఉద్యోగభద్రత లభించడంతో పాటు ప్రతి నెలా ఠంచన్‌గా జీతం వారి బ్యాంక్ ఖాతాల్లో జమఅవుతుంది. అంతకు ముందు వారు ఏజెన్సీలు ఎప్పుడు ఇస్తే అప్పుడు తీసుకోవాల్సి ఉండేది.

శ్రమకు గుర్తింపు

కర్నూలు నగరం ఏటేటా విస్తరిస్తోంది. ఇప్పటికే మునగాలపాడు, మామిదాల పాడు, స్టాంటన్ పురం, పెద్దపాడు, పందిపాడు, లక్ష్మీపురం గ్రామాలు నగరంలో విలీనమయ్యాయి. దీంతో కార్మికుల అవసరం పెరిగింది. ప్రస్తుతం కార్పొరేషన్‌లో రెగ్యులర్ కార్మికులు 260 మంది కాగా ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య 670 వరకు ఉంది. వీరందరినీ 52 వార్డుల పరిధిలోని 17 శానిటేషన్ డివిజన్లలో విధులు కేటాయించారు. ప్రతి రోజు రెండుపూటల ఉదయం 5.30 గంటలకు, మధ్యాహ్నం 2. 30 గంటలకు కార్మికులు విధుల్లో చేరి పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. వీరి శ్రమను గుర్తించిన జగన్ సర్కారు రూ. 12,500 నుంచి రూ.18,500కు వారి జీతం పెంచింది. అలాగే రెగ్యులర్ ఉద్యోగుల తరహాలోనే ప్రతి నెలా 1వ తేదీనే జీతం అందజేస్తుంది. ప్రతి సంవత్సరం మూడు జతల దుస్తులు, నూనెలు, సబ్బులు, కుట్టుకూలీ, పారిశుద్ధ్య పనులకు కావాల్సిన పనిముట్లు అందిస్తోంది.

ఇబ్బందులు తొలగాయి



నాలుగేళ్ల క్రితం వేతనాలు అందక ఇబ్బందులు పడేవాళ్లం. రెగ్యులర్‌గా పని చేస్తున్నా జీతాలు మాత్రం సక్రమంగా ఇచ్చే వారు కాదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అంటే పట్టించుకునే వారు కాదు. గతంలో ఎన్నో ఆందోళనలు చేపట్టాం. ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా గోడు వినింది. జీతాలు పెంచడంతో పాటు ప్రతి నెల 1 వ తేదీన ఆ సొమ్మును మా ఖాతాల్లో జమ చేస్తుంది.

–ఎం. శాంతమ్మ, కార్మికురాలు

జీతం పెంచారు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంతి అయిన తర్వాత మా కుటుంబాలు సంతోషంగా ఉన్నాయి. గతంలో రూ.12,500 జీతం ఇచ్చేవారు. ప్రస్తుతం రూ. 18, 500 ఇస్తున్నారు. అలాగే మా ఆరోగ్యానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి నెల 1 వ తేదీన రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా మాకు వేతనాలు ఇస్తున్నారు. ప్ర భుత్వం చేస్తున్న ఈ మేలును మేము ఎప్పటికీ మరువం.

– క్రిష్ణ వేణమ్మ, కార్మికురాలు

ఆగస్టు 31లోపు రీసర్వే పూర్తి కావాలి

- ఆర్‌డీఓలు, తహసీల్దార్లను ఆదేశించిన జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్) : రెండో దశ రీసర్వేను ఆగస్టు 31వ తేదీ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె రెవెన్యూ అంశాలపై జిల్లాలోని డివిజన్, మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. జిల్లా అంతటా స్టోన్ ప్లాంటేషన్‌ను సెప్టెంబర్ 30వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. రీసర్వే పూర్తయిన 67 గ్రామాల సచివాలయాల్లో జూన్ 23వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ల్యాండ్ కన్వర్షన్ కార్యక్రమాన్ని 15 రోజుల్లో పూర్తి చేసేలా చూడాలన్నారు. పత్తికొండ, ఆదోని రెవెన్యూ డివిజన్లను ఆదర్శంగా తీసుకుని కర్నూలు డివిజన్‌లోనూ రీసర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే రైతులకు భూ హక్కుపత్రాలు పంపిణీ చేయాలన్నారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులను తిరస్కరిస్తే సంబంధిత అర్జీదారుడికి కారణాలు చెప్పాలన్నారు. అనంతరం డివిజన్‌లోని రీసర్వేను ఆర్‌డీఓలు, తహసీల్దార్లను అడిగి ఆమె తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఆధునికీకరించిన కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయం ప్రారంభోత్సవంలో కలెక్టర్



ఆధునీకరించిన ఆర్‌డీఓ కార్యాలయాన్ని ప్రారంభించి పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులకు సూచించారు. ప్రజలు దేవాలయాలుగా భావించే కార్యాలయాలు అపరిశుభ్రంగా ఉంటే మంచికాదన్నారు. ఇది ఉద్యోగులను అనారోగ్యం పాలు చేస్తుందని చెప్పారు. ఆధునికీకరించిన కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయాన్ని కలెక్టర్ జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆర్‌డీఓ హరిప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. కార్యాలయంలో రికార్డులు భద్రపరిచిన గదులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో మైనర్ రిపేర్ల కోసం నివేదిస్తే నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అయితే సంబంధిత కార్యాలయాల హెచ్‌ఓడీలు ముందుకు వచ్చినప్పుడు ఇదే సాధ్యపడుతుందన్నారు. కొందరు హెచ్‌ఓడీలు తమకెందుకు అనుకొని అపరిశుభ్రత వాతావరణంలోనే పనులు చేసుకొనిపోతున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ముఖ్యంగా కార్యాలయం, ఆవరణాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయాన్ని ఆధునికీకరించేందుకు ముందుకు వచ్చిన ఆర్‌డీఓ హరిప్రసాదును కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఏఓ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నగరాన్ని అందంగా తీర్చిదిద్దండి

కర్నూలు (టౌన్): నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సృజన అన్నారు. శుక్రవారం స్థానిక పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు వద్ద సుందరీకరణలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ అక్కడ చేపడుతున్న పనుల గురించి వివరించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పనులు చేపట్టాలన్నారు. నగరపాలక ఈఈ షాకీర్ హుస్సేన్, మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

అవీ-ఇవీ

వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలి

కర్నూలు : గ్రామ రెవెన్యూ సహాయకులుగా సేవలందిస్తున్న వారందరికీ పే స్కేల్ వర్తింపజేయాలంటూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. ఈ అంశంపై శుక్రవారం జెడ్పీ నుంచి కేకే భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేకే భవన్‌లో పే స్కేలు అమలుపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంజి, శ్రీనివాసులు, రాధాకృష్ణ, మహేశ్వరి, మధు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ అంతరాయ సమస్యలపై వెంటనే స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. శుక్రవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాయం, ఇతర సమస్యలు తలెత్తినప్పుడు పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులు విని, వెంటనే స్పాట్‌కు వెళ్లాలని సూచించారు.

సర్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

కర్నూలు(సెంట్రల్): వినియోగదారులకు భారంగా మారిన విద్యుత్ సర్ చార్జీలను వెంటనే తగ్గించాలని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లాంతర్ల వెలుగులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెరిగిన విద్యుత్ ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ గుప్తా, జాన్ విల్సన్, బతుకన్న, బజారన్న, ప్రమీళ, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

కర్నూలు(రూరల్) : విజయవాడలో ఈనెల 18న జరగనున్న కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ ఎండీ అంజిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

స్టేడియం ఎదుట నిరసన

కర్నూలు(రూరల్): ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహిస్తున్న సంబరాలు వివాదస్పదంగా మారాయి. పోటీల నిర్వహణకు ఓ సంఘానికి అనుమతి ఇచ్చి మరో సంఘానికి నిరాకరించడంతో నిరసనకు దారి తీసింది. సీఈఓకు వ్యతిరేకంగా ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు బి. రామాంజనేయులు, క్రీడాకారులు స్టేడియ ఎదుట ఆందోళనకు దిగారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న సీఈఓ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆసోసియేషన్ ప్రతినిధి చిన్న సుంకన్న, హ్యాండ్‌బాల్ కార్యదర్శి శ్రీనివాసులు, పవర్ లిఫ్టింగ్ వేణు గోపాల్, కోలా ప్రతాప్, తైక్వాండో వెంకటేశ్వర్లు, హాకీ ప్రవీణ్, రాఘవేంద్ర, అథ్లెటిక్స్ సురేష్, వెయిట్ లిఫ్టింగ్ హాసన్, హ్యాండ్‌బాల్ వెంకటేశ్వర్లు, బాడ్మింటన్ రమేష్, రవితేజ, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు పీపీగా బాలరంగస్వామి



జి.బాలరంగస్వామి

కర్నూలు(లీగల్) : కర్నూలు అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి (అడిషనల్ సబ్ కోర్టు) పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది జి.బాలరంగస్వామిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన 2002 సంవత్సరం నుంచి న్యాయవాది వృత్తి నిర్వహిస్తున్నారు. అదనపు పీపీగా 3 సంవత్సరాల పాటు విధులు నిర్వహిస్తారు. నెలకు రూ.25 వేల వేతనం చెల్లిస్తారు. బాలరంగస్వామి నియామకంపైబార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

20న ఇస్కాన్ జగన్నాథ రథయాత్ర

కర్నూలు కల్చరల్:కర్నూలు ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ జగన్నాథ రథయాత్ర – 2023ను నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ కర్నూలు బాధ్యులు వైష్ణోక్య ప చైతన్య ప్రభు తెలిపారు. భగీరథ కాంప్లెక్స్‌లోని ఇస్కాన్ జగన్నాథ మందిరంలో రతయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు హరినామ సంకీర్తన, 7.30 గంటలకు మందిరం ప్రాంగణంలో రథయాత్ర, మహాహారతి, ఆశీర్వాదం,మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని,భక్తులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

క్రైం కార్నర్

ప్రభాస్ అభిమానుల దాడి

కర్నూలు : స్థానిక ఆనంద్ థియేటర్ వద్ద ప్రభాస్ అభిమానులు హల్‌చల్ చేశారు. ఆదిపురుష్ సినిమా బెనిఫిట్ షో కోసం గురువారం అర్ధరాత్రి పడిగాపులు కాస్తూ ఆ రోడ్డు మార్గంలో వెళ్లే బస్సులపై రాళ్లు రువ్వి అద్దాలు పగులగొట్టారు. సినిమా ప్రారంభం ఆలస్యం కావడంతో మద్యం మత్తులో ఉన్న కొంతమంది ప్రభాస్ అభిమానులు కొత్తబస్టాండ్ నుంచి ఆత్మకూరు వెళ్లే ఆత్మకూరు డిపో బస్సు, పుట్టపర్తి డిపో బస్సుతో పాటు మరో రెండు బస్సులు, క్యూఆర్‌టీ వాహనం అద్దాలను పగులగొట్టి అలజడి సృష్టించారు. ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామచంద్ర ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

కర్నూలు : నగర శివారులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ హాస్టల్‌లో కరెంట్ పనిచేస్తూ విద్యుత్ ప్రమాదానికి గురైన చాణక్య(25) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కర్నూలు బి.క్యాంప్ హౌసింగ్ కాలనీలో ఈ యువకుడు నివాసముంటాడు. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ హాస్టల్‌లో గత రెండు రోజులుగా కరెంటు పని చేస్తూ శుక్రవారం మరమ్మతు పనుల్లో భాగంగా కరెంటు తీగలు తగిలించి స్విచ్ వేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడున్నవారు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందాడు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పోర్ట్స్

ఇష్టమైన క్రీడల్లో రాణించాలి

కర్నూలు (రూరల్) : విద్యార్థులు ఇష్టమైన క్రీడల్లో సాధన చేస్తూ రాణించాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా సంబరాలు శుక్రవారం బి.క్యాంప్‌లోని సిల్వర్‌జూబ్లీ కళాశాల మైదానంలో బాస్కెట్‌బాల్ పోటీలతో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అతిథిగా శంకర్ శర్మ హాజరై మాట్లాడారు. చిన్నతనం నుంచే క్రీడల్లో సాధన చేస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, అవినాష్, సునిల్ కుమార్, రుద్రారెడ్డి, సతీష్, సుందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్ క్రీడాసంబరాలు ప్రారంభం

కర్నూలు(రూరల్) : ఒలింపిక్ డేను పురస్కరించుకుని జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడాసంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్ కుమార్, తైక్వాండో, అథ్లెటిక్స్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తైక్వాండో క్రీడను ఆదరించాలన్నారు. అథ్లెటిక్స్‌లో రాణిస్తే మంచి గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి

కర్నూలు (రూరల్): యువ క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తానని న్యాయవాది శ్రీధర్ రెడ్డి తెలిపారు. బీ క్యాంప్ క్రీడా మైదానంలో శుక్రవారం బాస్కెట్ బాల్ విజేతలకు బహుమతుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటలన్నారు. చిన్నతనం నుంచే క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానంలో అతీనా స్కూల్, రెండో స్థానంలో ప్రజ్ఞా భారతి స్కూల్, బాలికల విభాగంలో మెదటి స్థానంలో అతీనా స్కూల్, రెండో స్థానంలో సిస్టర్ స్టాన్సీల్లా స్కూల్ నిలిచాయి. గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశాడు.

మార్కెట్‌లోకి ట్రావెలర్ స్కూల్ బస్సు

కర్నూలు (టౌన్): నగర శివారులోని లక్ష్మీపురం బస్టాప్ వద్ద ఉన్న ఎస్ఎల్ఎన్ మోటార్స్ సంస్థ శుక్రవారం సరికొత్త ట్రావెలర్ బస్సును మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఫోర్స్ మోటా ర్స్ సంస్థకు చెందిన ఈ 42 సీట్ల ట్రావెలర్ బస్సును ఎస్ఎల్ఎన్ సంస్థ ఎండీ వెంకటేశ్వర రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫోర్స్ స్కూల్ బస్సు మోడల్స్ 16 సీట్ల నుంచి53 సీట్ల వరకు ఏసీ, నాన్ ఏసీలలో అందుబాటులో ఉన్నాయన్నా రు. బస్సులో బెంజ్ కారు ఇంజన్ అమర్చడంతో దృఢత్వంతో పాటు మైలేజీ పరంగా సౌకర్యంగా ఉంటుందన్నారు.



స్కూల్ బస్సును ఆవిష్కరిస్తున్న ఎండీ వెంకటేశ్వరరెడ్డి

పర్యాటకానికి యువశక్తి!

- విద్యా సంస్థల్లో యువ టూరిజం క్లబ్‌లు
- ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా ఏర్పాటుకు చర్యలు
- దేశంలోని విభిన్న సంస్కృతులు, భౌగోళిక ప్రాంతాలపై యువతకు అవగాహన
- నైపుణ్యం కలిగిన విద్యార్థులకు గైడ్‌లుగా అవకాశం



ఓర్వకల్ రాక్ గార్డెన్‌లోని సుందర దృశ్యం



కర్నూలు కల్చరల్: పర్యాటకంపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించడంపై కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ దృష్టిసారించింది. ఇందులో భాగంగా విద్యా సంస్థల్లో టూరిజం క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఆజాదికా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే ఈ క్లబ్‌ల ద్వారా విభిన్న సంస్కృతులు, భౌగోళిక ప్రాంతాలపై యువతకు అవగాహన కల్పించనుంది.

సమగ్ర అవగాహన

టూరిజం క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు దేశంలోని పర్యాటక ప్రాంతాలపై అవగాహన పెంచుతారు. టూరిజం క్లబ్‌లలో పాల్గొనడం వల్ల టీమ్ వర్క్, మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్ వంటి సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయి. ఈ క్లబ్‌లలో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు గైడ్‌లుగా, వలంటీర్లుగా అవకాశం కల్పించనున్నారు. వీరు బాధ్యతాయుతమైన టూరిజం పద్ధతులను అనుసరించడంతో పాటు పర్యాటక రంగంపై సంపూర్ణ అవగాహన కలుగుతుంది.

టూరిజం క్లబ్‌ల ప్రధాన లక్ష్యం

- దేశంలోని విభిన్న సంస్కృతులు భౌగోళిక ప్రాంతాల గురించి యువతకు అవగాహన కల్పించడం.
- విద్యతో పాటు పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యత, ప్రయాణాల గురించి వివరించడం.
- తొలి దశలోనే పర్యాటక అవకాశాల గురించి అవగాహన కల్పించడం
- బాధ్యతా యుతమైన పర్యాటక పద్ధతులను బోధించడం, ప్రచారం చేయడం
- విద్యార్థులను నైపుణ్యం కలిగిన టూరిస్ట్ గైడ్‌లుగా వలంటీర్ల హాస్పిటాలిటీ సెక్టార్‌గా శిక్షణ ఇవ్వడం
- స్టడీ టూర్స్, స్టూడెంట్ ఎక్ఛేంజ్ ప్రోగ్రామ్‌ల కోసం మెరుగైన సమన్వయాన్ని సులభతరం చేయడం

పర్యాటక క్లబ్‌లతో కొత్త రూపు



విద్యా సంస్థల్లో ప్రారంభించనున్న యువ టూరిజం క్లబ్‌లతో పర్యాటక రంగానికి కొత్త రూపు రానుంది. పర్యాటక ప్రదేశాలపై బహుళ ప్రచారం కల్పించడం జరుగుతుంది. జిల్లాకు పర్యాటక ప్రాభవాన్ని తీసుకొచ్చేందుకు క్లబ్‌లు దోహద పడతాయి. యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటుకు పలు విద్యా సంస్థలు ఉత్సాహంగా ముందుకు వస్తున్నాయి. టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసి పర్యాటకంపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పిస్తాం.

– విజయ, జిల్లా పర్యాటక అధికారి

జీతాలు సకాలంలో చెల్లించాలి

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పదోన్నతులు పొందిన, బదిలీ అయిన ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ వి.జి.హెచ్. వెంగళరెడ్డి, జిల్లా కార్యదర్శి వి.జవహర్‌లాల్‌తో కలిసి ట్రెజరీ శాఖ డి ప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావుకు వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ నాయకులు రాఘవరెడ్డి, తిమ్మప్ప, శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, ఏపీ ఎన్‌జీఓ సిటీ అధ్యక్షుడు కాశన్న, నాయకులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్టీవో అసోసియేషన్ నాయకులు సునీల్‌కుమార్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కర్నూలు(రూరల్): నగరంలో నివసిస్తున్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.జగన్నాథం డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సీఆర్ భవనంలో నగర కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో వేలాది మంది నిరుపేదలు సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరానికి కూతవేటు దూరంలోని జగన్నాథగట్టుపై అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ, టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రసూల్, మునెప్ప,రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.